# సాహసం శ్యేయరా!

— జి. ఆర్. మహర్షి

మా లక్ష్మయ్య మామ, వురుగాడు- తండ్రీ కొడుకు లిద్దరూకూడ బలుక్కొని జైల్లో పడ్డారని తెలిసి విస్తుపోయాను- అదీమా దోపిడీ నేరంపై.

లక్ష్మయ్యమామ , మా అమ్మకు పెదనాన్న కొడుకు.

ఆరడుగుల ఎత్తుతో, యాభై ఏళ్ళ వయసులోకూడా ఉక్కు ముక్కలా వుంటాడు. మీసాల మీద నిమ్మకాయలు వద్దన్నా నిలబడుతాయి. ఎప్పుడూ ఖద్దరు జుబ్బా తప్ప మరొకటి వేసుకోడు.

పై జేబులో కత్తెర మార్కు సిగరెట్టు పెట్టె అందరికీ కనిపించేలా వుంచుకుంటాడు. (అందులో ఒకే ఒక్క సిగరెట్టే వుంటుంది. అది వేరే విషయం.) పక్క జేబులో బీడీల కట్ట వుంటుంది. ఎవరూ లేనప్పుడు బీడీలు తాగు తుంటాడు.

పది మందిలో వున్నప్పుడు సిగరెట్టు తప్ప మరొకటి ముట్టుకోడు. సాధారణంగా అది ఇతరుల దై వుంటుంది.

అలా అని పెద్దగా లౌక్యం తెలిసిన వాడేంకాదు. కాస్త ఉబ్బేస్తే చాలు ముందు వెనకా ఆలోచించకుండా జేబులో వున్నదంతా ఖర్చు పెడతాడు. చెప్పడం మరిచాను. మామ కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని.

'కాంగ్రెసు పార్టీ అంటే అద్భుతం ఆహో! ఓహో!' అని పొగిడితే చాలు ఏ పనైనా చేసి పెడతాడు. వాళ్ళవూరి రచ్చబండ మీద రోజూ కాంగ్రెస్ ప్రాశస్త్యాన్ని వర్ణించి చెపుతుంటాడు. ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే వారి మీదికి నిలువెత్తున లేస్తాడు. అడ్డ దిడ్డంగా వాదించి, అరిచి భీకరాకృతి ధరించి అవతలి వ్యక్తి నోరు మూయించాలని చూస్తాడు. అప్పటికీ ఆ మనిషి వాదన కొనసాగించే ప్రయత్నం చేస్తే, మామ వాదించడం ఆపేస్తాడు. అవతలి మనిషి మీద కలియబడి తంతాడు- లేదా తన్నించుకుంటాడు.

ఆ క్షణంలో అప్పటికప్పుడు ఏది న్యాయమని తోస్తే అది చేయడం మామ అలవాటు. నమ్మకం. ఈ విషయంలో తర్కం వుండదు. సాధారణంగా ఆయన కండబలాన్నే నమ్ముతుంటాడు.

ఎలెక్షన్లొస్తే చూడాలి మామ జోరు! పోటీలో వున్నది తానే అన్నట్టు ఫీలవుతుంటాడు. అన్ని చోట్లా ఆయనే కనిపిస్తాడు.

బ్యానర్లు, జెండాలు కట్టే చోటికొచ్చి "ఛీ నాకొడకల్లారా! అట్లేనేరా జెండాలు కట్టేది" అంటూ చీవాట్లేసి దగ్గరుండి కట్టించేవాడు.

ఎన్నివేల కరపత్రాలైనా సరే, అనాయాసంగా పంచేసేవాడు. ఊరేగింపుల్లో ముందుండి అందరినీ అదిలిస్తూ అజమాయిషీ చేస్తుంటాడు.

తనని రవంత గుర్తిస్తేచాలు అదేఆనందం మామకు. ఒకసారి వాళ్ళ ఎమ్మెల్యే భుజం తట్టాడట, అదొక మధురస్మృతిగా చెప్పుకుంటాడాయన.

"కాంగ్రెస్‌పార్టీలో నీ క్యాడర్ ఏమిటి?" అని అడిగితే "క్రియాశీలక కార్యకర్తను" అని గర్వంగా చెపుతాడు.

పోలింగ్ రోజు మొట్ట మొదట వెళ్ళి ఓటేసే వాడు. తరువాత నింపాదిగా వెళ్ళి దొంగ వోట్లు వేస్తాడు.

ఎదుటి పార్టీ వాడు దొంగ ఓటు వేస్తూ దొరికి పోతే "మీరేం మొగాళ్ళురా! ఒకనికి పుట్టి ఇంకొకని పేరు చెప్పుకుంటారు. చీమూనెత్తురు లేని నా కొడుకులు" అని ఈసడిస్తాడు. అవతలి వ్యక్తి నీలిగితే తొడగొట్టి మీసాలు మెలేసి బస్తీమే సవాల్ అంటాడు.

మామ బొడ్లో ఎప్పుడూ ఒక మరకత్తి వుండేది. అయితే దాని పదునెంతో ఎవరికీ తెలియదు. దాన్ని బయటికి తీసి పొడుస్తానని బెదిరించే వాడే కాని, ఎన్నడూ తీసిందిలేదు.

పాతాళ భైరవి సినిమాని ఓ వందసార్లు చూసుం టాడు. ఆ సినిమా వచ్చిన మొదట్లో ఎస్వీ రంగారావు మాదిరి గడ్డం పెంచుకొని "సాహసం శ్యేయురా" అని అరుస్తూ తిరిగే వాడట. ఇదేదో గాలికి సంబంధించిన వ్యవహారమనుకొని తాయెత్తులు కట్టి, వేపమండలతో పిచ్చి బాదుడు బాదేసరికి గడ్డం తీసేశాడని ప్రతీతి.

అయితే "సాహసం శ్యేయురా" మటుకు ఊత పదంగా వుండి పోయింది.

అంత తెలివైన నేపాళ మాంత్రికుడు, కోతి చేష్టల అంజిగాడి చేతిలో మోసపోయి గడ్డాన్ని వూడగొట్టు కోవడం మామకు ఎంత మాత్రం ఇష్టం లేదు. మోసాన్ని ఒకసారైనా మాంత్రికుడు కనుక్కో లేక పోతాడా అని ఆ సినిమాని అన్నిసార్లు చూసాడట. కాని లాభం లేక పోయిందని పెదవి విరుస్తాడు.

దాదాపు పదేళ్ళ క్రితం, టెన్త్ పరీక్షలు రాశాక అనుకుంటూ- మామ వాళ్ళ వూరికి మొట్ట మొదటి సారిగా వెళ్ళాను.

నన్ను చూసి మామ సంబరపడి పోతూ, "ఇన్నాళ్ళకు గుర్తొస్తిమా?" అని నిష్ఠూరమాడుతూ "నిన్న వచ్చి వుండాల్సింది నాయ్!" అన్నాడు.

"ఏం?" అన్నాను.

"దయ్యం చెయ్యి చూసే వాడివి" చిన్నగా రహస్యం చెపుతున్నట్టుగా అన్నాడు.

"అంటే ఎట్లుంటుందది?" ఆశ్చర్యపోయి అడిగాను.

"మనచెయ్యికి రెండింతలు లావుంటుంది. ఒకటే బొచ్చు. ఒక్కోగోరు మన చెయ్యి పొడవు. అసలు కథ విను. ఎ క్లాసు గుంటుంది. మొన్నరాత్రి చెరువులో చేపలు పట్టే దానికి పోయినా, రాత్రి పూటే ఎందుకు పోయినా చెప్పు?"

"ఎందుకు?"

"పగటిపూట పోతే, చెరువును వేలం పాడినోళ్ళు తిప్పలాడుతారు కదా! సరే కథలో యాడుండాం?"

" చెరువు దగ్గర"

" తెల్లారిలేసి నక్కను చూసినానో ఏమో బుట్టెడు చాపలు చిక్కినాయి. వాటిని సస్తాబతుకుతా మోసుకొని వస్తుంటే, ఎట్ట కనుక్కుందో ఏమోగాని దెయ్యం కనుక్కొనేసింది. ఇక దాంతో ఎంటపడింది. 'ఒరే లక్ష్మయ్యా చేపలియ్యరా' అంటూ. అయితే నేను ఎనక్కి తిరిగి చూసే నాకొడుకునా?"

"చూస్తే ఏమయితుంది ?"

"చారెడు రక్తం కక్కొని సచ్చిపోతాం. అది నా వెంటే వచ్చింది ఇంటి దాకా. నేను ఏమీ ఎరగనోడిలా ఇంటికి పోయి చేపలు ఉడకబెట్టి తింటి. ఇకచూడు, ఆ వాసనకి దానికి తిక్కలేసిపోయింది. 'ఒరే లంజకొడకా, ఒక చాపన్నా ఇస్రా' అంది కిటికీ లోంచి చెయ్యి పెట్టింది. అంతే ఒకే ఏటు మచ్చుకత్తితో! చెయ్యి తెగి కింద పడింది. దయ్యం సత్తునకొర్డి పారిపోయింది. తెల్లారే సరికి జనం తిరనాల మాదిరి వచ్చినారు ఆ చెయ్యి చూసేదానికి. పక్కవూర్ల నుంచి ఎద్దులబండ్లలో జనం మన ఇంటికి. ఎద్దులు కట్టేసే దానికి జాగా లేక నేనే అందరిని తరిమి నా "

"మరి ఆ చెయ్యి"

"కుక్కెత్తుకుపోయింది."

" ఏ పిండారి కుక్కకు అంత ధైర్యం కూడానా" అత్తరంగంలోకి వచ్చింది చేతులు తిప్పుతూ.

"ఇదిగో అబ్బయ్యా, దెయ్యాలు లేవు భూతాలు లేవు. ఈ వూళ్ళో అసలు సిసలైన దెయ్యం అంటూ

వుంటే అది నీ మామ, ఆ కోతి ముఖం కుక్క. సారాయి తాగి రోజూ ఇట్టా తిక్కకూతలు కూస్తావుంటాడు." అత్త తిట్లు వినగానే మామ, ఆయన పెంపుడు కుక్క సింహం మెల్లగా బయటికి జారు కో సాగారు. సింహ మంటే మామకు చాలా ప్రేమ. అప్పులోళ్ళ బారి నుంచి మామను అది చాలా సార్లు రక్షించిందని జనం చెప్పు కుంటారు.

జారుకుంటున్న మామను చూసి "ఇదిగో నిన్నే, నిలబడు" అని అత్త గర్జించింది. ఆ గర్జనకు సింహం దిక్కు తెలియకుండా పారిపోయింది. మామ ఎటూ తేల్చుకో లేక గుమ్మం వద్ద ఆగిపోయాడు.

" ఒట్టి మాటలు చెప్పేదేనా? వచ్చినోడికి ఏమైనా చేసి పెట్టేదుందా?" అంది.

"దానికేం కోడి కోస్తాం"నింపాదిగా చెప్పాడు మామ.

"యాడని సిండంలో వుందాయా కోళ్ళు! నేను నానా సావు సచ్చి గింజలు మేపి సాకితే, కొక్కొరోకో అని కూతకొస్తే సాలు గొంతు కోసి నీ కడుపులో పెట్టు కుంటివి" ఈసడించింది అత్త.

"చూడు, నా తడాఖా" భీకరంగా వెళ్ళి పోయాడు మామ.

నేనూ, పురూ చెరువులో స్నానం చేసి వచ్చే సరికి కోడీ కూర ఘుమఘుమలాడుతూ సిద్ధంగా వుంది. పురూగాడికి నా ఈడే. మామ ఏకైక పుత్రరత్నం. వాడి పూర్తి పేరు పురుషోత్తం.

అయిదవ తరగతితో వాడు స్కూల్ మానేసాడు. స్కూల్‌కి వెళ్ళడం కంటే మించిన బాడ్‌కోవ్ పని మరొకటి లేదని వాడి నమ్మకమూన్ను, విశ్వాసమూన్ను.

సరే వెళ్ళి కోడి కూర పని పట్టసాగాం.

"కోడి యాడిది నాయనా?" ఎముకలు కట కటా కొరుకుతూ అడిగాడు పురూ.

"నోరు మూసుకొని తినకపోతే, నిన్ను కూడా కోడి మాదిరి కసకసా కోస్తా నాకొడకా" గదమాయించాడు. మామ.

పురూ నోరు మూత పడింది.

ఇంతలో ఎవరో మహిళ నోరు విప్పి, మోర పై కెత్తి తిట్లు కురిపించడం మొదలు పెట్టింది.

మామ వంశస్తులందరినీ భూమిలో నుంచి బయటికి లాగి బూతులతో కడగసాగింది.

బూతుల సారాంశాన్నంతా విశ్లేషించగా ఏతావాతా తేలిందేమిటంటే, మేము తింటున్నకోడి ఆమెదని!


ఆ తిట్లకు మామ ఏ మాత్రం తొణక్కుండా కోడి తోపాటు తిట్లను కూడా మింగి 'బ్రేవ్' మన్నాడు.

మామ తినడం ముగించి అగ్గిపుల్లతో పళ్ళను కుట్టు కుంటూ బయటికి వచ్చాడు.

మామను చూడగానే ఆమె తిట్ల నింకా ఉధృతం చేసింది.

"తిడితే తిటావు గాని రెడ్డెమ్మా, కోడి మాత్రం నీ






క్షేమంగుండే, కడుపుకు తినకుండా ఎన్నాళ్ళు మేపితే ఏం లాభం చెప్పు?" అని సముదాయించ బోయాడు.

ఆ మాటతో రెడ్డెమ్మ నాగుపాము మాదిరి బుసకొడుతూ "ఏమంటివిరా దొంగమొకమోడా, సింగారి నాబట్ట, కోడిని దొబ్బితిని మాటలు కూడానా మళ్ళీ? నీ వంశం నాశనమైపోనూ, నీ నోటికి పాము కుట్టా. నా కోడిని తిన్నట్టే, నీ సింహాన్ని కూడా ఎవరో ఒకరు కోసుకొని తింటారు లేరా!" ఎగరొస్తూ ఆశీర్వదించింది.

దెబ్బ మామ వీక్ పాయింట్‌కి తగిలింది.

"ఇదిగో రెడ్డెమ్మా, నన్ను దొంగ నాకొడకా అను సలుపుతా, కాని నా సింహాన్ని అన్నావో నేను మనిషిని కాను నరసింహాన్ని" బెదిరించాడు కోపాన్ని అణుచుకుంటూ.

"నీ సింహాన్ని తిడితే కోపం కారి పోయిందే, మరి నా కోడి, అది మామూలు కోడా! బంగారు కోడి. నేను యాడికి పోతే ఆడికి వచ్చి 'కొక్కొక్కొ' అని కాళ్ళచుట్టూ తిరిగేది." అని కోడి అంద చందాలు, గుణగణాల్ని వర్ణిస్తూ, మామని శాపనార్థాలు పెట్ట సాగింది రెడ్డెమ్మ.

అప్పటి వరకూ అరుగుపై కూచొని రెడ్డెమ్మ కోడి ఎముకల్ని తదేక శ్రద్ధతో నములుతున్న సింహానికి చలనం కలిగింది. తన యజమానికి ఏదో ఆపద వాటిల్లిందనే విషయం అర్థమయ్యింది. తాను రంగంలోకి దిగి స్వామి భక్తిని ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించింది. వెంటనే పైకి లేచింది. కాళ్ళను ముందుకు పెట్టి శరీరాన్ని రబ్బరులా సాగదీసింది. జాయ్ మంటూ మీద కొస్తున్న జోరీగల్ని ఓరకంటతో నిర్లక్ష్యంగా చూసింది. ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా రెడ్డెమ్మ మీదకి దూకి పిక్క అందుకోడానికి తీవ్ర ప్రయత్నం చేసింది.

ఈ మెరుపు దాడికి రెడ్డెమ్మ అదురుకుని కుక్క జాతిని నానావిధాల దూషిస్తూ ఒక్కడుగులో ఇంట్లోకి లంఘించి తలుపులేసుకుంది. కిటికీలోంచి తిట్ల అస్త్రాలు విసరాలని చూసింది. అయితే సింహం భయానక స్వరూపం చూసి, కిటికీలోంచి కూడా అది దూక గల సమర్థురాలని భయపడి కిటికీ మూసి తనలో తానే గొణుక్కో సాగింది.

చెటమని అరిచి నానా యాగీ చేయకుండా పని పూర్తి చేయడం సింహం ప్రత్యేకత. కార్యసాధకురాలు.

రెడ్డెమ్మను వీరోచితంగా తరిమికొట్టిన సింహాన్ని ముద్దాడుతూ " అలా సాహసం చేయాలిరా" అని అభినందించాడు మామ.

తరువాత కొన్ని ఏళ్ళపాటు మామ వాళ్ళ వూరికి వెళ్ళడానికి వీలు కుదరలేదు. అప్పుడప్పుడు మామే తిరుపతి వచ్చేవాడు. కొండకు వెళ్ళి నామాల స్వామిని చూసి వస్తూ వస్తూ దారిలో చేతి సంచిని పోగొట్టుకొని




నూతన యవ్వనం పొందండి!
సంతానవంతులుకండి!
చర్మవ్యాధుల నుండి విముక్తులుకండి!

హస్త ప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, దాంపత్య సుఖం లేకపోవుట, సంతానము లేకపోవుట, ఉబ్బసం, సొరియాసిస్ పొడలు, దురద, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిపుండ్లు, సుఖ సంబంధమైన వ్యాధులు, ఫిస్టులా, మూలశంకలు, స్త్రీల కుసుమ వ్యాధులు, బ్లడ్ ప్రెషర్, పక్షపాతము, మేహపొడలు, సమస్త దీర్ఘ వ్యాధులకు, చర్మ వ్యాధులకు ఆయుర్వేద చికిత్స, పోస్టుద్వారా కూడా చికిత్స కలదు.

ప్రతినెల క్యాంపులు: ప్రతి నెల 1, 16 తేదీలలో రాజమండ్రి హోటల్ అశోకాలో, కోటగుమ్మం వద్ద
ప్రతి నెల 2, 17 తేదీలలో కాకినాడ సీనస్ ఎ.సి. లాడ్జి, కల్పన టాకీసు వద్ద
ప్రతి నెల 3, 18 తేదీలలో భీమవరం, షణ్ముఖ లాడ్జిలో
ప్రతి నెల 9వ తేదీలో ఒంగోలు హోటల్ పూర్ణిమ, బస్టాండ్ వద్ద
ప్రతి నెల 25వ తేదీలో ఖమ్మం హోటల్ కిన్నెర ఎ.సి., బస్టాండ్ దగ్గర


ప్రతి క్యాంపులోను ఉదయం గం. 10-00 నుంచి రాత్రి గం. 10-00 వరకు.

పై క్యాంపు తేదీలు మినహా మిగిలిన రోజుల్లో డాక్టరుగారు గుడివాడ క్లినిక్‌లో వుంటారు.

డి. మార్కండేయులు, ఆయుర్వేద ఫిజిక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్టు,
పామర్రు రోడ్, గుడివాడ 521 301, ఫోన్: 2522 & 2540

SHAH ADS.

# మానకూడని గాయం



నాకు మాత్రం
ఎవరున్నారు చెప్పు?
కాళ్ళకింద నమ్మకమైన భూమీ
పైన ఎప్పుడూ
నన్ను కనిపెట్టుకుండే ఆకాశపు నీలమూ
ఈ పక్క ఎప్పుడూ
కేరింతలాడే సముద్రమూ
ఆ పక్క నన్నసలు పట్టించుకోని కొండా
తప్ప!
ఇదుగో...ఇప్పుడు
నానాళ్ళకు నీ నుండో దయగల వుత్తరం
మే మాసపు ఎండల్లో
తిరిగి తిరిగి గది కొద్దునుకదా!
తలుపులు తియ్యగానే
దూసుకొచ్చే చల్లటి సముద్రపు గాలిలా
కాళ్ళకు చుట్టేసుకుంది నీ వుత్తరం
ఎప్పుడూ నెత్తికెక్కి చూమనే వుత్తరం
ఇదేంటి చెప్మా అని విప్పబోతే
ఒక సంజాయిషీ వాక్యం
కాళ్ళమీద జారిపడి
పాదాన్ని గాయం చేసింది
నెత్తురోడుతున్న పాదంతో
అక్షరాల వెంట పరుగెత్తగా పరుగెత్తగా
చివరకో వాక్యం
"నేను నిన్ను ఎప్పుడూ మర్చిపోలేద"ని
ఆ వాక్యాన్నే రోజూ
గాయానికి కట్టుగా కడుతున్నా
బహుశా త్వరలో
గాయం మానిపోవచ్చు
- అయినా
కొన్ని గాయాలు
మానకుండా వుంటేనే
బాగుంటుంది కదూ!

— శిఖామణి

మరీ వచ్చేవాడు.

నేను డిగ్రీ చదువుతుండగా మామ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. 'పురూ గాడికి పెళ్ళి చేసి పారేశాను.' అని రాశాడు.

అమ్మ నొచ్చుకుంది, తనని పిలిచి చీర పెట్టనందుకు. విషయం తెలుసు కుందామని నేను వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి మామ ఇంటిముందు కూచొని కత్తిని కరకర నూరు తున్నాడు. మధ్య మధ్యలో వేలుతో పదును చూస్తున్నాడు.

పెళ్ళి జరిగిన గుర్తులేవీ ఇంటి ముందు కనిపించ లేదు.

ఇంతలో ఓ అమ్మాయి లోపలి నుంచి బయటికి వచ్చింది. ఆమె చేతిలో ఒక మచ్చు కత్తి వుంది. "మామా, దీన్ని అటక నుంచి దించినా, దీన్తో ఏస్తే ఏటు కి ఇద్దరు! తొందరగా సానబట్టు" అని చెప్పి లోని కెళ్ళి పోయింది.

"బలే కోడలు పిల్లా అలా సాహసం శ్యేయాలి" అని మెచ్చుకుంటూ మామ నావైపు చూసి "ఏంనాయ్ ఎప్పొచ్చినావు?" అని అడిగాడు.

"ఏం మామా ఏంది కథ! ఎవరి పైకి కత్తులు" అని అడిగాను.

"మీ మామతో పెట్టుకుంటే మాటా, మజాకా?" మీసం మెలేసాడు.

"విషయం చెప్పు?"

"కథ శానావుంది, విను" అని మొదలు పెట్టాడు.

"ఏం లేదు, ఒకరోజు మా పురూ గాడిని పిలిచి బెండకాయ బ్రహ్మచారి కథ చెప్పి 'నీ పెళ్ళి సేస్తా కొడకా' అన్నా. దాంతో వాడు వంగి వంగిగా చూసి ఫలానా మూరప్ప కూతురు అంటే నాకు ఇది," అన్నాడు.

"ఆ పిల్లక్కూడా నీ మీద ఇదేనా?" అనడిగినా.

అవునన్నాడు. మరింకేం అన్నాను.

"ఆ మూరప్ప గాడికి మనమంటే లోకువ. మనిద్దరం గ్యారంటీ దొంగ నా కొడుకులమని వాడి నమ్మకం. అందుకే లక్ష్మి దేవికి సంబంధాలు చూస్తా వుండారు" అన్నాడు.

"నేను తేలుస్తా" అని మూరప్ప ఇంటికి పోయినా. నన్ను చూసి అందురూ తిక్కమొగా లేసినారు. నేను అందర్నీ ఎంట్రుకింద జమకట్టి "పాప లక్ష్మిందేవి" అని పిలిచినా. "ఏం మామా" అని వచ్చిందాయమ్మే మాంచి ధైర్యస్తురాలు ఆ పిల్ల.

"నీకూ మావాడికీ పెళ్ళి ఇష్టమైతే పదపోదాం" అన్నా.

"రైట్" అంది లక్ష్మిందేవి.

"నీకెన్ని గుండె కాయలురా నా కొడకా" అని మూరప్ప నీలిగినాడు.

నేను మీసాలు మెలేసి "-అరే బేవార్స్ మొకమోడా? పిల్లా పిల్లోడు ఇద్దరూ ఇష్టపడినప్పుడు మధ్యన నీదేందిరా బోడి పెత్తనం" అన్నా. అయినా వాడు వినలేదు.

నేను వెంటనే బొడ్లోని కత్తి చూపించి "అరే మూరప్పా! ఒక మాట విను! ఈ కత్తివుండాదే, దీన్ని నేనెందుకు బయటికి తియ్యనో తెలుసా? దానికొక లా పాయింటుంది. దాన్ని బయటికి తీసినాను అంటే, ఎవనిదో ఒకని పీనిగ పడాల్సిందే! నువ్వు గానీ, నీ కొడుకు గానీ, ఎవుడు ముందుకు అడుగు వేస్తే వాడు గ్యారంటీ సఫా. దీంట్లో అనుమానమే వద్దు." అనేసి లక్ష్మిందేవిని తీసుకొని వచ్చినాను. ఒక్క ముండనా కొడుక్కి కూడా కదిలే దొమ్మకాయలు కూడా లేకుండా పోయినాయి.

"మరి ఇప్పుడు కత్తులు నూరటమెందుకు?" ప్రశ్నించాను.

"ఈ రోజు మూరప్పగాడింటికి టౌన్నుంచి మనుషు లొచ్చినారంట- సమాచారం తెలిసింది. ఎందుకైనా మంచిది మన బందోబస్తులో మనముంటే" అన్నాడు.

ఆ రోజు రాత్రి అందరూ సుష్టుగా భోంచేసిన తర్వాత, మామ, పురూగాడు, కోడలు పిల్ల, అత్త అందరూ కలిసి కత్తులు, కొడవళ్ళు పట్టుకొని ఉత్సాహంగా ఇంటికి కాపలా కాశారు. సింహం కూడా హుషారుగా చెవులు టపటపలాడిస్తూ తన ప్రతాపం చూపించడానికి సిద్ధం గావుంది. ఆర్కెస్ట్రాకు సూచనలిచ్చే సంగీత దర్శకుడి చేతిలోని కర్ర మాదిరి తన తోకను వూపుతోందది.

నాకు కూడా ఒక కర్ర ఇవ్వడానికి వచ్చాడు మామ.

"నావల్ల కాదులే" అన్నాను.

"సాహసం శ్యేయరా అల్లుడూ, లేకుంటే బతుకులో మజా వుండదు." అన్నాడు.

గతంలో జరిగిన యుద్ధాలను గురించి నెమరు వేసుకుంటూ ఆ రాత్రిని గడిపారు వారు. నాకు మాత్రం బెరుగ్గానే వుండింది.

ఏమీ జరుగ కుండానే కోడి కూసింది.

"వాళ్ళెక్కడ వస్తార్రా, ఆదారి నాకొడుకులు" అని ఎకసెక్కం చేసాడు మామ.

కాని మూరప్ప తన మనుషులతో రానే వచ్చాడు తాంబూలాలు తీసుకొని.

మూరప్పను చూసి మామ ఒక్కక్షణం ఆశ్చర్య పోయాడు. వెంటనే తేరుకొని సగౌరవంగా ఆహ్వానించాడు.

మూరప్ప వచ్చి మామ చేతులు గట్టిగా పట్టుకొని "బావా, అయిందేదో అయింది. ఈరోజు నుంచి అది నా పిల్లకాదు నీ బిడ్డ. నలుగురు నవ్వుతుందారు. గౌరవంగా పెండ్లి జరిగితే..." ప్రాధేయ పడ్డాడు. కళ్ళనీళ్ళ తో.

"దానికింతగా అడగాలా! తిక్కనాయాలా" అన్నాడు మామ ఆనందంగా. ధాం ధూమ్మని పెళ్ళి జరిగింది.

మామ ఘనంగా ఖర్చు పెట్టాడు. దాని ఫలితంగా రెండెకరాల భూమి తాకట్టులోకి వెళ్ళింది. అది వేరే

విషయం.

మొదట్నుంచీ మామ ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే. మామ నిఘంటువులో రేపు అన్న పదమే లేదు. ఆ క్షణమే ప్రధానం ఆయనకు. దీంతో అప్పులు తీర్చడానికి వీల్లేనంతగా పెరిగాయి. ఇక భూములు పండేది అం తంత మాత్రమే. ప్రతీ ఏడూ అతివృష్టే అనావృష్టో!

పురూ పెళ్ళి జరిగిన ఒక సంవత్సరం తరువాత మామ నాదగ్గరకి వచ్చాడు. ఇంటికి వెళ్ళకుండా సరాసరి ఆఫీసుకే వచ్చాడు.

మామని అంత దీన స్థితిలో చూడడం అదే మొదలు. బట్టలన్నీ మాసిపోయి, గడ్డం పెరిగి, మొహం పీక్కు పోయింది.

''ఏం మామా విశేషాలు'' పలకరించాను.

''విశేషాలు తర్వాత- ఆకలేస్తుంది, భోజనానికి పోదాంరా'' అని లాక్కెళ్ళాడు.

హోటల్ కెళ్ళాం.

చికెన్ బిరియాని, ఫ్రై ఇంకా రెండు మూడు పదార్థాలు ఆర్డరిచ్చాడు మామ. టేబుల్ నిండా తెచ్చి పెట్టాడు సర్వర్.

వాటిని చూసి '' ఒరే డబ్బులున్నాయా, లేదా?'' గుస గుసలాడాడు మామ .

''ఫస్ట్ తారీఖు కదా జీత మొచ్చింది''అన్నాను.

''ఆ ధైర్యంతోనే కదా, నీ దగ్గరికి వచ్చింది'' అని బిరియానీ పై పడ్డాడు.

రెండు ముద్దలు ఆబగా తిని నావైపు చూసి'' ఏంది ఈ లక్ష్మయ్య గాడు ఎప్పుడూ తిండి మొకమే చూడనట్టు తుక్కు లేపుతుండాడు అనుకుంటున్నావా? ఇంటి పొయ్యిలో పొగవచ్చి రెండు దినాలైంది. అప్పు కోసం నానాసావు సచ్చినా, కానీ ఎవుడిస్తాడు? మనది దొంగ మొకమని అందరికి నోటెడ్! అయినా ఊళ్ళో అందిరి బతుకులు అట్లే కాలినాయిలే! టికెట్టులేకుండా దొంగ రైలెక్కి వచ్చినా, ఎవురూ పట్టుకోలేదులే. పట్టు కున్నా మా ఎమ్మెల్యే పేరు చెపితే నమస్కారం చేసి విడిసి పెడతాడులే. నువ్వొక మూడు మార్లు అప్పియ్యాల్రా! పంట చేతి కొచ్చినాక తీరుస్తా.''

నేను మారు మాట్లాడకుండా మూడు వందలు తీసి ఇచ్చాను. వద్దని ఎంత వారించినా మామే బిల్లు కట్టాడు. ఒక కే.జి. స్వీట్లు ప్యాక్ చేయించాడు.

''మీ అత్త వుండే నిప్పుల మొకంది! తీపి అంటే శానా ఇష్టం'' అన్నాడు.

''తొందరగా నీ అప్పు తీరుస్తాలేరా అల్లుడూ, దిగులు పెట్టుకోకు'' నవ్వుతూ అని వెళ్ళి పోయాడు. కొంత కాలం పాటు మామ అయిపు అజా లేదు.

తరువాత ఈ దోపిడీ వార్త తెలిసింది.

మామావాళ్ళను అనంతపురం సబ్ జైల్లో వుంచారని తెలిసింది. చూడటానికి వెళ్ళాను.

పర్మిషన్ తీసుకొని జైలులోని కెళ్ళాను.

నేను వెళ్ళే సరికి మామ, పురూ, ఇద్దరు ఆనం దంగా బీడీలు తాగుతూ సెల్‌లో పేకాట ఆడు కుంటు న్నారు.

''పడిందిరా జోకర్'' పుర్నా గాడి తొడ చరిచాడు మామ.

'' జోకర్ పడడం కాదు నాయనా జోకర్ వచ్చాడు చూడు'' అంటూ నా వేపు వేలు చూపించి పెద్దగా నవ్వాడు పురూ.

''రావోయ్ అల్లుడూ! సమయానికొచ్చావు, ముందు సిగరెట్లు పడేయ్, నోరు ఎండి పోయింది, ఈ పాడు బీడీలు తాగి''. అంటూ సిగరెట్లు పుచ్చుకున్నాడు.

సెల్‌లో ఓ మూలగా కూర్చొన్న బక్క పలచటి శాల్తీ ఒకటి వచ్చి నాముందు నిల్చుంది.

''సిగరెట్టు కావాలా?'' అని అడిగాను.

''ఫైళ్ళు కావాలి'' అడిగాడు ఆశగా.

''ఏమిటీ! ఫైళ్ళు !! వాటినేం చేసుకుంటావు'' ఆశ్చర్యంగా అడిగాను.

''నేను బ్యాంకిలో అటెండర్నండి. ఫైళ్ళు మోసు కొని అటు ఇటూ అందివ్వడం నావని. ఇక్కడ ఖాళీగా వుండాలంటే ప్రాణం పిసుక్కున్నట్టు వుంది. అందుకే రెండు ఫైళ్ళు, ఖాళీవైనా ఫరవాలేదు. టైంపాస్ అవు తుంది నాకు!''

అటెండర్ వైపు మామ కొరకొరా చూస్తూ 'ఫైళ్లా! నీ పిండమా! గాడిద మొకమోడా నీ సావాసం వల్లే కదరా మాకీ గతి పట్టింది.'' అన్నాడు.

ఆ మాటకు అటెండర్ గజగజా వణికి పోతూ మూల నక్కాడు.

''ఇంతకూ విషయమేంది?'' ప్రశ్నించాను.

''ఏ విషయం?'' అన్నాడు మామ.

''మీ దోపిడీ విషయం!''

''అదా! బలే కతలే సెపుతాను ఇను'' చెప్పసాగాడు.

''శానా ఏండ్ల కిందట, నాఇంట్లో బంగారు పొగలేసే దినాల్లో ఈ అటెండర్ గాడికి ఐదు మార్లు బాకీ ఇచ్చినా ఆ తర్వాత మనం పాపర్‌గా మారితిమి. వీడేమో పైసా కూడా ఇయ్యలేదు. ఒక రోజు వీడి మెడకుటువ్వాలు బిగించి నిలేసి 'బాకీ కక్కురా బడ్‌కవ్' అన్నాను.

''నన్ను కట్టేసి కొట్టినా పైసాలేదు'' అన్నాడు ఈ నాకొడుకు. ''కొట్టను, తిట్టను, బాకీ కట్టకపోతే కుత్తి క్కాయ పిసికి సంపుతా''అన్నాను.

దాంతో సలిజరం వచ్చి నోడుమాదిరి వణుకుతూ 'నన్ను సంపితే ఏమొస్తుంది నా మాట ఇంటే అరవై వేలు వస్తాయి''అన్నాడు.

ఆ మాటతో నాకు ఆశ పుట్టి, వీడికో పొట్లం సారాయి తాగించి ''ఏందిరా కత?'' అడిగినాను.

''అదంత సులంకాదు. దానికి సాహసం శ్యాయాలి'' అన్నాడు. దానికేం ఢోకా లేదు. అదే మన ఇంటి పేరు.

''ఏమీలేదు రేపు నేను అనంతపురం పోతావుండా. అరవై వేలకు చెక్కు డ్రా చేస్తావుండా. నేనుబ్యాంకు నించి బయటికి రాగానే, నువు నీ కొడుకూ నా కళ్ళలో కారం కొట్టి డబ్బులు తీసుకొని పారిపోండి కారులో!''

# అకవిత 89

సంపదల భూమి మన భారతదేశం
కాని
ఇవన్నీ కోల్పోయే భయం
అవినీతి కాలుష్యం
తీరూ తెన్నూలేని జనం
అడ్డూ అదుపూలేని అక్రమార్జితం
వీటి మూలంగా దేశానికి ముప్పు వాటిల్లే అవకాశం
భూమిమీద పెరిగే ప్రజలకు ప్రాణాంతకం అవుతున్నాయి
రోజూ మరింత కలుషితమైపోతున్నాయి మనసులు
విషపూరిత నాయకులు విడిచే వాయువుల వల్ల
అధికార రోగగ్రస్తులు కార్చే పదార్థాల వల్ల

కాలుష్యం నిండిన రాజకీయాలు
అమూల్యమైన విలువల్ని పాడుచేస్తున్నాయి
సహజ సంపద స్వార్థానికి గురి అవుతోంది
ఫలితంగా ప్రజల్లో సమతుల్యం దెబ్బతింటోంది

మనం ఇదేమిటీ అన్యాయం అని అడగలేక పోవచ్చు
ఎంచేతంటే అప్పటికి మనం ప్రాణ శక్తిని కోల్పోయి
వుండొచ్చు
ఎడారి జీవితం వారసత్వంగా లభించొచ్చు

ఈ వైపరీత్యం ఇలాగే సాగితే
మన పిల్లలు కూడా
అక్రమార్జితాల ఆటాకీ కోసం ఆరాట
పడాల్సి వస్తుంది

సహజ సంపదల్లో సమ భాగస్వాములవడం
అందమైన ప్రపంచంలో ఆరోగ్యంగా
బతకటం
పచ్చటి పరిసరాల్లో పెరిగి పెద్దవటం
మనిషి జన్మహక్కు
అలాంటి ప్రపంచాన్ని అందించాల్సిన బాధ్యత
అధినాయకులందరికీ వుంది
అందకపోతే అందింపుకోవాల్సిన బాధ్యత
మనందరికీ వుంది
దానికోసం గట్టిగా కోరండి
ఆధునిక కాలపు దుశ్శాసనుల్లాగా
ప్రజా సంపదాపహరణ అత్యాచారం
చేయవద్దని విన్నవించండి
వినని వాళ్ళమీద విప్లవించండి

—అకవులు

"కారెక్కడుంది?"

"నేను మాట్లాడతా, నాకు లాంటి డ్రైవర్ ఒక డున్నాడు! వాడికికూడా వాటా"

"నాకులాంటి డ్రైవర్ దగ్గరికి పోయాం. వాడు సంబర పడిపోతూ, "అన్నా! ఎన్ని ట్రిప్పులు తోలితే నాకన్ని డబ్బులొస్తాయి! మీరు చెప్పినట్టు ఇంటా" అన్నాడు.

"మేం కారెక్కగానే ఎక్సిలేటర్‌ని పాతాళానికి అదమాలి! తెలిసిందా?" అన్నాను.

"ఆల్‌రైట్" అన్నాడు వాడు.

"మరుసటి రోజు ఈ కోతి మొగం అటెండర్ డబ్బు తీసుకొని బ్యాంకు నుంచి బయటికొచ్చినాడు. నేను, పురుగాడు చేతిలో కారంపొడి పట్టుకొని సిద్ధమైతిమి. నాకు డ్రైవర్ కారుని స్టార్టింగ్‌లో పెట్టుకొని వుంచాడు. అటెండర్ కన్ను కొట్టినాడు. మేమిద్దరం రయ్యిమని వాడి దగ్గరికి పోయినాం. కానీ, వాడేం చేసినాడో తెలుసా-క్యాష్ బ్యాగ్‌ని గట్టిగా సంకలో అదిమి పెట్టుకొని చెవులు పగిలి పోయేటట్టు మేక మాదిరి అరుపులు ఎత్తుకున్నాడు. దాంతో మేం తత్తరపడి కారం పొడి విసిరినాం! దాంతో కండ్లు మండినాయి సూడు దేవుడా! పగోళ్ళకి కూడా వద్దు ఆ బాధ".

"ఎవరి కళ్ళు?" అడిగా.

"మాకళ్ళే"

"విసిరింది మీరే కదా?"

"నిజమే కాని గాలివాలు చూసుకోవద్దా? ఎదురు గాలికి కారంపొడి అంతా మాకండ్లలోనే పడింది. ఇంక మేం యాడికి పోవాలా? జన మొచ్చి పట్టుకుందారు.

నాకు డ్రైవర్ ఎప్పుడో పరార్. తరువాత పోలీసు లొచ్చి 'ఏంది కత' అని అడిగినారు. మొత్తం చెప్పేస్తిమి.

"డ్రైవర్ ఎక్కడుండాడు?"

"నెల్లూరులో"

"అతన్ని పోలీసులు పట్టుకోలేదా?"

"నెల్లూరులో అంటే నెల్లూరు జైల్లో అని. గురుడు నెల్లూరు వరకూ కారాపలేదు. అక్కడి పోలీసులు బ్రేకు లేయించారు,"

"అయినా నీకు దోపిడీలెందుకు మామ?" కోపంగా అన్నాను.

"దోపిడీ ప్లాన్ అంతా బాగానే వుందిరా ఖర్మకాలి దొరికి పోయాం అంతే?"

"అయినా ఈ మాత్రం సాహసం శ్యేయాల్లేరా. మనం జైల్లో పడినామని తెలిస్తేసాలు. పెద్ద పెద్దోళ్ళంతా వచ్చి బెయిలిచ్చి ఇడిపించుకొని పోతారు. సూత్తావుండు" అన్నాడు బింకంగా.

తరువాత కొద్ది రోజులకు నిజంగానే ఒక పెద్ద మనిషి వచ్చి మామకు బెయిలిచ్చి విడిపించాడు కేసు కూడా వీగి పోవచ్చు అంటున్నారు.

ఈ దోపిడి సంఘటన జరిగిం తరువాత మామ అంటే వాళ్ళ వూళ్ళో వాళ్ళకి ఎక్కడలేని భయం, గౌరవం ఏర్పడ్డాయట.

●

# ముఖాలు



## ముందే చెప్పలేదు కదా

అవును ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. ఇంకా ఒక క్రమం రాలేదుగాని
నా కాలాన్ని దీని కోసమే వెచ్చిస్తున్నాను.
ఇక్కడెన్ని ముఖాలున్నాయో మునుపెప్పుడూ నాకు తోచనే లేదు.
మన చుట్టూ వేలకొద్దీ ప్రజలూ. ఒకొక్కడూ ఎన్నెన్నో ముఖాల్తో
కొన్ని వేల వేల ముఖాలూ-
కొంత మంది ఒకే ముఖాన్ని ఏళ్ళ తరబడి తొడుక్కుంటారు.
సరే అది మామూలుగానే మురికి పట్టి కుట్లు తెగిపోతుంది.
సాగిపోయి దీర్ఘ ప్రయాణంలో సడలిన చేతి గ్లోవ్‌లా తయారౌతుంది.
వీళ్ళంతా బహు జాగ్రత్తపరులు. సులువుగానే అర్థం చేసుకోవచ్చు వీళ్ళని.
వీళ్ళు ముఖాన్ని ఎప్పుడూ మార్చుకోరు. శుభ్రం చేసుకోవాలనైనా తోచదు.
అదే మంచిదంటే ఎవరు మాత్రం కాదంటూ వాదించగలరు?
అన్ని ముఖాల్నీ ఏం చేసుకుంటారని మీరడగొచ్చు. వీళ్ళు ముఖాల్ని
భద్రం చేస్తారు. వాళ్ళ పిల్లలు వాటిని తొడుక్కుంటారు.
ఒక్కోసారి వాళ్ళ పెంపుడు కుక్కలు కూడా ముఖాల్ని తొడుక్కుని
షికారు వెళుతుంటాయి. ఏం వెళ్ళకూడదనా? ముఖం ముఖమే!

ఇంకొంత మంది ముఖాల్ని నమ్మలేనంత వేగంగా మార్చుకుంటారు.
ఒక్కొక్క ముఖాన్నే వాడి పారేస్తుంటారు. ముఖాలు శాశ్వత సరఫరా
అవుతాయనుకుంటారు గాని ఇలా నలభయ్యులో పడతారో లేదో
అలా చివరి ముఖం చేతిలోకి వచ్చి పడుతుంది.
ఇది కాస్త విషాదకరమైన విషయమే!
ముఖాల జాగ్రత్త తీసుకోవడం వీళ్ళకే అలవాటున్న పని కాదు. ఆఖరి
ముఖం వారం రోజుల్లో అరిగిపోతుంది. చాలా చోట్ల కన్నాలు పడి
కాయితంలా పలచబడిపోతుంది. తర్వాత కొద్ది కొద్దిగా అముఖపు రేఖా
ఛాయలు పొడసూపుతాయి. ఇక దాంతోనే వాళ్ళు తిరుగుతారు.

కానీ స్త్రీ. స్త్రీ. ఈమె పూర్తిగా తనలోకి తాను జారిపోతుంది. ముందుకి తన
చేతుల్లోకి జారిపడిపోతుంది.
ఆ వీథి చివర ఆమెని చూడగానే నేను నిదానంగా నడక సాగించాను.
నిర్భాగ్యులు ఆలోచనల్లో వున్నప్పుడు వాళ్ళకి అంతరాయం కలిగించ
కూడదు. బహుశా వాళ్ళ గురించిన ఆలోచనే వాళ్ళకి కలుగుతూండవచ్చు.
వీధి ఖాళీగా వుంది. ఖాళీ వీథికి చికాకు పుట్టుకొచ్చినట్టుంది.
నా పాదాల కింద నుంచి అడుగుల్ని లాగి వీథినిండా విసిరేసింది.
అవి లోహంలా ధ్వనిస్తూ కట్టెల్లా వీథి నిండి పడ్డాయి.
ఆమె ఒక్కసారిగా లేచి కూచుంది.
బెదురుతో తొందరగా దోసిట్లో ముఖం వుండిపోయేంత తీవ్రంగా
తనలోంచి తనను బైటికి లాక్కుంది. దోసిట్లో ముఖం కనిపిస్తూనే వుంది.
ఆ ముఖం వైపే చూస్తూ, చేతుల్లోంచి వెనక్కి వెళ్ళిన ఆకారం నేను
చూడకుండా వుండడానికి నేను పెద్ద ప్రయత్నం చెయ్యాల్సొచ్చింది.
దోసిట్లో మిగిలిన ముఖం వొణుకు పుట్టిస్తోంది నాలో.
అంతకన్నా భయంకరం.
తోలు వూడొచ్చినట్టున్న ఆమె తల. ఏ ముఖమూ లేని ఆ తల
అంతకన్నా భయంకరం

మూలం - రిల్కే

అనువాదం - వాసు